అక్షరాభ్యాసం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం మాదారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొత్తగా చేరిన చిన్నారులకు శనివారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం అంజయ్య ఆధ్వర్యంలో చిన్నారుల చేత అక్షరాలను దిద్దించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని హెచ్‌ఎం సూచించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.. కొనసాగుతున్న ఆందోళన



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

శేరిలింగంపల్లి: ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ రెండవ రోజు మహిళలు శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మియాపూర్ సర్వే నెంబర్ 100,101 లలో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇళ్ళు లేక చాలీ చాలని వేతనాలతో అవస్థల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి తహశీల్దార్ వెంకారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకారెడ్డి ఇప్పటికే ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకున్నారని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

శిల్పారామం.. స్వర్గధామం















మాదాపూర్: శిల్పారామం నగరవాసులను ఆకట్టుకుంటోంది. పల్లెటూరి వాతావరణాన్ని తలపిస్తుండడంతో నగరవాసులు, సందర్శకులు సరదాగా గడుపుతున్నారు. వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు శిల్పారామంలో అనువైన ప్రాంతం.పార్కింగ్ సమస్య లేదు. సాంప్రదాయ వేదిక, రాక్‌హైట్స్, మౌంటేన్‌హైట్స్, శిల్పకళావేదిక, కోనసీమ ప్రాంతాలలో నిర్వహించుకోవచ్చు.

ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఉంటుంది.పెద్దలు, చిన్నారులకు బోటింగ్, బ్యాటరీ కార్, ఎద్దుల బండి లో తిరగవచ్చు. పచ్చిక ఉండడంతో సీనియర్ సిటిజన్‌లు వాకింగ్ చేస్తూ సరదాగా గడుపుతున్నారు. చిన్నారులకు ప్రత్యేక ఆటస్థలాన్ని ఏర్పాటు చేశారు. ఉయ్యాల, బెంచ్‌లు, జారుడు బండలు, ట్రీ హౌస్ లాంటి ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తయారు చేసిన హస్త కళా, చేనేత, గృహాలంకరణ ఉత్పత్తులు అందుబాటులో ఉండడంతో సందర్శకులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వివిధ దేశాలకు చెందిన తెల్లకోడులు, బాతులు, పక్షులు కనువిందు చేస్తున్నాయి.

- ఆడియో ఫంక్షన్లు, వార్షికోత్సవాలు, రిసెప్షన్‌లు అధికం
- ప్రదేశాన్ని బట్టి రేట్లు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం
- సీటింగ్ కెపాసిటీని బట్టి ఎంపిక చేసుకుంటున్న ఆర్గనైజర్స్
- సంవత్సరానికి దాదాపు 100 కార్యక్రమాలు.
- వివాహాది శుభకార్యాలకు.. రూ. 1.28 లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. జీఎస్టీ ఎక్స్‌ట్రా.

మోకాలి దెబ్బ.. ఆర్థోస్కోపీ చికిత్స

8 ఏళ్ల చిన్నారికి దెబ్బతిన్న లిగమెంట్ నయం చేసిన కిమ్స్ వైద్యులు



సర్జన్ డా.ప్రతాప్

గచ్చిబౌలి: ఎనిమిదేళ్ల పాప ఆడుకుంటుండగా మోకాలికి దెబ్బ తగలడంతో ఆపరేషన్ లేకుండానే నయం చేసినట్లు ఆర్థోస్కోపీ, స్పోర్ట్స్ మెడిసన్ సర్జన్ డాక్టర్ ప్రతాప్ పర్వతనేని తెలిపారు. ఎంఆర్ఐలో యాంటీరియర్ క్రూషియేట్ లిగమెంట్(ఏసీఎల్) చిరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఏసీఎల్ టేర్ అవ్వడం ఎనిమిది సంవత్సరాల వయస్సులో అరుదుగా జరుగుతుందన్నారు. పిల్లలకు ఏసీఎల్ టేర్ శస్త్ర చికిత్స చేయడం కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో మొదటిసారి అని పేర్కొన్నారు. ఆర్థోస్కోపీ శస్త్ర చికిత్స, ఫిజియోథెరపీ ద్వారా లిగమెంట్ సమస్యను పూర్తిగా నయం చేసినట్లు వివరించారు. పూర్తి స్థాయిలో కోలుకున్న ఆ పాప స్కూల్‌కు వెళుతుందని, ఆడుకుంటుందని తెలిపారు. సరైన సమయానికి వైద్యం అందించడమే చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే గాంధీకి కాలనీవాసుల వినతి



శేరిలింగంపల్లి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. సుదర్శన్‌నగర్, ఆలిండ్ ఎంప్లాయిస్ కాలనీల ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే గాంధీని కలిసి సమస్యలను వివరించారు. మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వాటర్ ప్రెషర్ పెంచేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీలవాసులు సత్యనారాయణ, సత్యం, జీవరత్నం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, సాయిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని వార్డు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులతో డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సండే మార్కెట్ బస్సు రూట్, హిందూ శ్మశానవాటిక నుంచి మైనార్టీ శ్మశానవాటిక వరకు సెంట్రల్ లైటింగ్‌తో కూడిన డివైడర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను కోరినట్లు వివరించారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలో విద్యుత్‌దీపాల సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించాలని ఆదేశించారు. పలుచోట్ల రోడ్డు మధ్యలో స్తంభాలు ఉన్నాయని వాటిని తొలగించి పక్కన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



సాయిఐశ్వర్య కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు

తిరాయదుర్గం: కాలనీల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు.శనివారం ఖాజాగూడ సాయి ఐశ్వర్యకాలనీలో స్థానికులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తయిన చోట సీసీ రోడ్లు వేయాలని కోరగా అధికారులకు ఫోన్ చేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయా సమస్యలను పరిశీలించారు. అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. కాలనీలో పార్కు స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు, క్రీడాప్రాంగణం, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, సాయి ఐశ్వర్య కాలనీ సభ్యులు ప్రభాకర్, అమిత్ భరద్వాజ్, భాగ్యలక్ష్మీ, అశోక్‌రాజు,రమణి, రాంచందర్‌రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

సాయిఐశ్వర్య కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన పూజలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నర్సింహమూర్తి, బీజేపీ నాయకులు తిరుపతి, నర్సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

లిఫ్ట్ పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ పార్కులో సీనియర్ సిటిజన్స్, యోగా భవనానికి వచ్చే వారి కోసం ఎమ్మెల్యే గాంధీ స్వంత నిధులు 5 లక్షల వ్యయంతో చేపట్టబోయే లిఫ్ట్ నిర్మాణ పనులకు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ త్వరలో లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, రాంచందర్, వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ ఫేజ్ 2లోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయం 19వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. వేడుకల్లో ఆలయ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సెయింట్ జేవియర్స్ ఫేర్‌వెల్ అదుర్స్



ఆటపాటలతో ఆకట్టుకున్న విద్యార్థులు

కార్యక్రమంలో విద్యార్థుల సందడి

రాయదుర్గం: నృత్యాలు, గీతాలాపనలు, పలు రకాల కార్యక్రమాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. శనివారం గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో ఎంబీఏ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెయింట్ జేవియర్స్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తూ ప్లేస్‌మెంట్స్‌లో ముందున్నామని గుర్తు చేశారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యం పెంపుదలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు కళాశాల కార్యదర్శి సుధీర్ బహుమతులు అందించారు. పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


భళా.. నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం ఎస్ఎల్‌బి కూచిపూడి కళానిలయం గురువు డాక్టర్ వినీలారావు శిష్యబృందం నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో బ్రహ్మాంజలి, రుక్మిణీ ప్రవేశదరువు, కొలువైతివా రంగసాయి, జావళి, ధనుశ్రీ తిల్లాన, దశావతార శబ్దం, నారాయణీయం, భో శంభో, మ్యూజిక్ తదితర అంశాలను కళాకారులు ఉషారాణి, ప్రవళ్లిక, ఇందుసహస్ర, మోక్ష, మనస్విని, మహాలక్ష్మి, శిరీష, గౌతమి, అనన్య, వైష్ణవి, శ్రీనిధి, రితిక, కిన్నెర తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం కూచిపూడి నృత్యాలయ కళాక్షేత్రం శిష్యబృందం నృత్యార్చన చేశారు. వినాయకకౌత్వం, దశావతార శబ్దం, రామాయణశబ్దం, కళింగనర్తన తిల్లాన, దేవదేవం, నారాయణ శబ్దం కీర్తనలకు కూచిపూడి నృత్యం ప్రదర్శించి అలరించారు. గురువు జ్యోతి మరదాని, కళాకారులు దృతిక లక్ష్య, ఐరాశుక్ల, శాన్వి, అనుశ్రీ, నాగశ్రీ ధృతి, వింధ్య, తన్వి, అదితి మైత్రేయి, నక్షత్ర, నేపథ్య యాదవి, దీక్షిత, సమీక్షరెడ్డి, అదితి, సాయిశ్రావ్య, దేదీప్య, సాత్విక, రితిష, పద్మ అక్షయ, జోషితరెడ్డి, లోహిత, స్ఫూర్తి, గాయత్రి, రక్షితలు పాల్గొన్నారు.



రాంగ్‌రూట్‌లో వాహనం నడిపితే ఎఫ్ఐఆర్



పట్టుబడిన వారికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ నర్సయ్య

మాదాపూర్: రాంగ్‌రూట్‌లో వచ్చి ప్రమాదాలకు గురికావద్దని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య తెలిపారు. మాదాపూర్‌లో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆవాస హోటల్ యూటర్న్ వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న 12 మంది వాహనదారులను పట్టుకున్నారు. అందులో ఒకరిపై ఎఫ్ఐఆర్ చేశారు. మిగిలిన 11 మందికి జరిమానాలు విధించారు. పట్టుబడిన వారికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

టాస్కులు, కమీషన్ పేరుతో లక్ష రూపాయలు కాజేశారు

'సైబర్' బారిన గోకుల్‌నగర్ వాసి

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్ పేరుతో సైబర్‌వలలో పడి ఓ వ్యక్తి రూ. లక్ష ఐదువేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని గోకుల్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి జూన్ 14వ తేదీన ఓ మెసేజ్ వచ్చింది. టాస్కులు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామనడంతో బాధితుడు స్పందించి తన వివరాలను నమోదు చేసి, అపరిచిత వ్యక్తి చెప్పినట్టుగా పలుదఫాలుగా రూ. ఒక లక్ష 5 వేలు వేశాడు. అనంతరం బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చండీహోమం



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శనివారం చండీహోమం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ శశిధర్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్యల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చండీహోమం చేశారు.

ఆర్థిక సాయం అందజేత

శేరిలింగంపల్లి: నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లోని సులభ్ కాంప్లెక్స్‌లో విధులు నిర్వహించే మహేష్‌ఠాకూర్ పండిత్ కుటుంబానికి మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల మహేష్‌ఠాకూర్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అసోసియేషన్ ప్రతినిధులంతా కలిసి రూ.75వేల నగదును మృతుని భార్యకు అందించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సైబర్ క్రైమ్ సీఐ రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ సీఐ రవికుమార్

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని సైబర్ క్రైమ్ సీఐ రవికుమార్ అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమాలు , సైబర్ నేరాలను ఎలా గుర్తించాలనే విషయాలపై అవగాహన కల్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... సోషల్ మీడియాను అవకాశంగా తీసుకుని సైబర్ నేరగాళ్లు యువతను టార్గెట్ చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని, వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టకూడదని, గుడ్డిగా అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను నమ్మకూడదని తెలిపారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ నాయక్, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని విస్టా ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. పాఠశాల చైర్మన్ వెల్లంకిరావు ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెడ్‌బాయ్, హెడ్ గర్ల్‌తోపాటు ఇతర విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే నాయకత్వం నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్రమశిక్షణ విద్యార్థులకు ఎంతో ముఖ్యమని, తప్పనిసరిగా అలవర్చుకోవాలన్నారు. అంతకుముందు విద్యార్థుల కవాతు అందరినీ ఆకట్టుకుంది. ప్రిన్సిపల్ మేరీ శాంతిప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోపన్‌పల్లి విస్టా ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థుల కవాతు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

హఫీజ్‌పేట్: ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. చందానగర్ హుడా కాలనీలోని సాయిబాబా టెంపుల్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో ఓ మహిళ (45) పడిపోయి ఉందని చందానగర్ పోలీసులకు 100 ద్వారా సమాచారం అందడంతో వెంటనే అక్కడకు చేరుకొని పరిశీలించారు. మృతదేహంను పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మహిళ ఒంటిపై నల్లచీర, నల్ల జాకెట్టు, ఆకుపచ్చ రంగు గాజులు, ఎరుపు రంగు స్కార్ఫ్ వేసుకుని ఉంది. ఎడమ చేతిపై బాలయ్య అనే టాటూ ఉందన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చేపల వేట

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కిష్టాయిపల్లి గ్రామ శివారులోని ఓ కుంటలో చేపల వేట కొనసాగింది. ఇటీవల కురిసిన వర్షాలకు గండిగూడెం చెరువు నుంచి చేపలు కొట్టుకు వచ్చాయి. కుంటలో చేపలు ఎగిసిపడుతుండటాన్ని గుర్తించిన కొంతమంది సుమారు 30 కిలోల చేపలు పట్టుకున్నారు.చేపల వేటను చూసేందుకు అటుగా వెళ్తున్న వాహనదారులు బారులు తీరారు.

ట్రాన్స్‌జెండర్స్ బైండోవర్



మాదాపూర్: ఏడుగురు ట్రాన్స్ జెండర్లను మాదాపూర్ పోలీసులు శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్టు మాదాపూర్ సీఐ గడ్డం మల్లేష్ తెలిపారు. ఐకియా ఫ్లైఓవర్, మాదాపూర్ ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులు, పాదచారులను ట్రాన్స్‌జెండర్స్ ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు సమాచారం అందడంతో చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మంచి ప్రవర్తనతో ఉండాలని వారికి సూచించారు.